సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



వీకేఓసీ అనుమతుల్లో జాప్యం

సింగరేణి ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో కొత్తగూడెం వీకే–ఓసీకి పర్యావరణ అనుమతుల్లో జాప్యం జరుగుతోందనే ఆరోపణలున్నాయి. 10లో



మద్దతు ధర వైపే మొగ్గు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర లభిస్తుండడంతో రైతులు అక్కడే విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
$24^{\circ} / 22^{\circ}$

జిల్లాలో మంగళవారం పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

ఓట్లు.. కొల్లగొట్టారు!

మెజార్టీలో రికార్డులు సృష్టించిన కాంగ్రెస్ అభ్యర్థులు

- 2018లో 20 వేలు దాటని ఆధిక్యత
- ఈసారి పొంగులేటి, కనకయ్యకు 50 వేలకు పైగానే...
- కాంగ్రెస్ నుంచి గెలిచిన ఏడుగురికి 20వేల పైనే మెజార్టీ
- 'వార్.. వన్ సైడ్' అన్నట్లుగా తీర్పు ఇచ్చిన ఓటరు



ఫలితాలు వెలువడ్డాక జూలూరుపాడులో విజయోత్సవం నిర్వహిస్తున్న కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓటర్లు ఈ ఎన్నికల్లో ఏకపక్ష తీర్పు ఇచ్చారు. గతంలోనూ ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అధిక సంఖ్యలో స్థానాలు గెలిచినా, ఈసారి మాత్రం విజేతలు రికార్డుస్థాయిలో మెజార్టీ సాధించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి చాలాచోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు రెండింతల మెజార్టీ వచ్చింది. 2018 ఎన్నికల్లో పినపాక కాంగ్రెస్ అభ్యర్థి రేగా కాంతారావుకు వచ్చిన 19,565 ఓట్ల మెజార్టీనే అత్యధికం. కానీ ప్రస్తుత ఎన్నికల్లో ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య 57,309 ఓట్లు, పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 56,650 ఓట్ల మెజార్టీతో మొదటి, రెండో స్థానాల్లో నిలిచారు. మరోవైపు భద్రాచలంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఏకైక అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు 5,719 ఓట్ల మెజార్టీ మాత్రమే దక్కింది.

అప్పుడు 20వేల లోపే..

2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని ఆరు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అశ్వారావుపేట, సత్తుపల్లిలో మిత్రపక్షంగా పోటీ చేసిన టీడీపీ అభ్యర్థులు మెచ్చా నాగేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య గెలిచారు. ఖమ్మంలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్, వైరాలో స్వతంత్ర అభ్యర్థి లావుడ్యా రాములునాయక్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ గత ఎన్నికల్లోనూ మిత్రపక్షాలను కలుపుకుని ఎనిమిది స్థానాల్లో విజయబావుటా ఎగురవేసింది. పినపాక కాంగ్రెస్ అభ్యర్థి రేగా కాంతారావుకు.. బీఆర్ఎస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లుపై 19,565 ఓట్ల ఆధిక్యం దక్కింది. సత్తుపల్లి నుంచి పోటీ చేసిన సండ్ర వెంకటవీరయ్యకు బీఆర్ఎస్ అభ్యర్థి పిడమర్తి రవిపై 19,002 ఓట్ల మెజార్టీ దక్కింది. ఆ ఎన్నికల్లో ఇవే అత్యధిక మెజార్టీలు. వైరా స్వతంత్ర అభ్యర్థి లావుడ్యా రాములునాయక్‌కు అతితక్కువగా 2,013 ఓట్ల మెజార్టీ లభించింది.

బీఆర్ఎస్‌కు 5వేల పై చిలుకు మెజార్టీ

గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులకు ఎక్కువ మెజార్టీ రాగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలం మాత్రమే బీఆర్ఎస్‌కు దక్కగా అక్కడి విజేత తెల్లం వెంకట్రావు అతితక్కువ మెజార్టీతో బయటపడ్డారు. ఆయనకు కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యపై 5,719 ఓట్ల మెజార్టీ వచ్చింది. గత ఎన్నికల్లోనూ వీరిద్దరే తలపడగా.. అప్పుడు వీరయ్యకు 11,785 ఓట్ల మెజార్టీ రావడం గమనార్హం. ఇక కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా కొత్తగూడెం స్థానం నుంచి పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు 26,547 ఓట్ల ఆధిక్యత లభించింది. 2018 ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుకు 4,139 ఓట్ల ఆధిక్యత మాత్రమే దక్కింది. అలాగే, 2009 ఎన్నికల్లో సీపీఐ నుంచి పోటీ చేసిన కూనంనేనికి కాంగ్రెస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుపై 2,004 ఓట్ల మెజార్టీ మాత్రమే రాగా, ఈసారి 26వేల పైచిలుకు మెజార్టీ సాధించడం విశేషం.

వన్ సైడ్ చేసిన ఓటరు

ఓటు ఎటువైపు వేయాలనే విషయంలో పోలింగ్‌కు ముందే ఓటర్లు స్పష్టతకు వచ్చినట్టుగా ఫలితాలను గమనిస్తే తెలుస్తోంది. కొన్నిచోట్ల హేమాహేమీలకు కూడా అనుకున్న స్థాయిలో ఓట్లు లభించలేదు. దీంతో ఈసారి వార్ వన్‌సైడ్ చేయాలనే ఆలోచనతో ఓటర్లు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఫలితంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ అభ్యర్థులకు స్పష్టమైన మెజార్టీ లభించింది. సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయికి 19,440 ఓట్ల మెజార్టీ రాగా.. కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఇదే తక్కువ మెజార్టీ. అయితే, 2018 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన వెంకటవీరయ్యకు 19,002 మెజార్టీ దక్కగా.. ఈసారి ఆయనపై గెలిచిన రాగమయికి దాదాపు అంతే మెజార్టీ లభించింది.

కదం తొక్కిన కాంగ్రెస్

ఈసారి అధిక మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులు రికార్డుల మోత మోగించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేశారు. ఇక కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ప్రచారానికి వచ్చారు. దీంతో గతంతో పోలిస్తే ఈసారి గట్టి పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. ఆ అంచనాలను తలకిందులు చేస్తూ ఓటర్లు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టారు. ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య 57,309, పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 56,650, ఖమ్మం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు 49,381 ఓట్ల ఆధిక్యతతో ప్రత్యర్థులపై ఆధిపత్యాన్ని కనబరిచారు. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క మధిర నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 35,452 ఓట్ల మెజార్టీ సాధించడం విశేషం.

2018, 2023 ఎన్నికల్లో అభ్యర్థులు సాధించిన మెజార్టీ..

- **ఖమ్మం నియోజకవర్గం :** 2018లో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్, టీడీపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావుపై 10,991 ఓట్ల తేడాతో గెలిచారు. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌పై 49,381 ఓట్ల మెజార్టీ దక్కించుకున్నారు.
- **పాలేరు నియోజకవర్గం :** 2018లో కాంగ్రెస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి.. బీఆర్ఎస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుపై 7,669 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డిపై 56,650 ఓట్ల తేడాతో గెలిచారు.
- **వైరా నియోజకవర్గం :** 2018లో స్వతంత్ర అభ్యర్థి లావుడ్యా రాములునాయక్ 2,013 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌పై గెలిచారు. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్ 33,045 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌పై విజయం సాధించారు.
- **మధిర నియోజకవర్గం :** గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టివిక్రమార్క... బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్‌పై 3,567 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. ఇప్పుడు మళ్లీ భట్టి.. పాత ప్రత్యర్థే అయిన కమల్‌రాజ్‌పై 35,452 ఓట్ల ఆధిక్యం పొందారు.
- **సత్తుపల్లి నియోజకవర్గం :** 2018లో టీడీపీ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య 19,002 ఓట్ల తేడాతో బీఆర్ఎస్ అభ్యర్థి పిడమర్తి రవిపై విజయం సాధించారు. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి 19,440 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి సండ్రపై గెలిచారు.
- **పినపాక నియోజవర్గం :** గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రేగా కాంతారావు బీఆర్ఎస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లుపై 19,565 మెజార్టీ పొందారు. ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు.. బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావుపై 34,506 ఓట్ల మెజార్టీ సాధించారు.
- **ఇల్లెందు నియోజకవర్గం :** 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కోరం కనకయ్యపై కాంగ్రెస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ 2,887 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య.. బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియపై 57,309 ఓట్ల తేడాతో గెలిచారు.
- **కొత్తగూడెం నియోజకవర్గం :** గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు.. బీఆర్ఎస్ అభ్యర్థి జలగం వెంకట్రావుపై 4,139 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇప్పుడు సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు.. ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగంపై 26,547 ఓట్ల తేడాతో విజయం దక్కించుకున్నారు.
- **అశ్వారావుపేట నియోజకవర్గం :** 2018 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు.. బీఆర్ఎస్ అభ్యర్థి తాటి వెంకటేశ్వర్లుపై 13,117 ఓట్ల తేడాతో గెలిచారు. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి జారె ఆదినారాయణ.. బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుపై 28,905 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.
- **భద్రాచలం నియోజకవర్గం :** గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య.. బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావుపై 11,785 ఓట్లతో మెజార్టీతో విజయం సాధించారు. ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు 5,719 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యపై గెలిచారు.

భిన్న ధ్రువాలు.. విభిన్న ఫలితాలు

- పట్టుబట్టి గెలిచిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- వంతంతో పోటీ చేసిన సీపీఎంకు చుక్కెదురు



కూనంనేని



తమ్మినేని వీరభద్రం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలు భిన్నదారులను ఎంచుకుని విభిన్నమైన ఫలితాలను చవిచూశాయి. పొత్తుల విషయంలో కాంగ్రెస్ తాత్సారం చేస్తోందంటూ సీపీఎం 19 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసి ఎక్కడా గెలవలేకపోయింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సహా అందరికీ పరాజయమే ఎదురైంది. మరోపక్క ఒక్క సీటైనా చాలంటూ కొత్తగూడెం నుంచి బరిలోకి దిగిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాత్రం విజయఢంకా మోగించారు.

మూడు నెలల ముందు వరకు కలిసే...

సాధారణ ఎన్నికలకు మూడు నెలల ముందు వరకు సీపీఐ, సీపీఎంలు బీఆర్ఎస్‌తో కలిసి రాజకీయ ప్రయాణం సాగించాయి. అయితే బీఆర్ఎస్ పార్టీ ఏకపక్షంగా టికెట్లను ప్రకటించడంతో బీఆర్ఎస్ – కమ్యూనిస్టుల దారులు వేరయ్యాయి. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా బీజేపీని నిలువరించాలనే లక్ష్యంతో కాంగ్రెస్‌తో కమ్యూనిస్టులు జత కట్టారు. పాలేరు, మిర్యాలగూడ, భద్రాచలం సీట్లను సీపీఎం, కొత్తగూడెం, హుస్నాబాద్, బెల్లంపల్లి, వైరా టిక్కెట్లు కావాలంటూ సీపీఐ అడిగాయి. నామినేషన్ల ప్రక్రియ సమీపిస్తున్నా కాంగ్రెస్ నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో సీపీఎం తనదారి తాను చూసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 19 స్థానాలను ఎంచుకోగా, ఉమ్మడి జిల్లాలో పినపాక, కొత్తగూడెం మినహా మిగిలిన ఎనిమిది స్థానాల్లో బరిలోకి దిగింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు నుంచి స్వయంగా పోటీ చేశారు. అయితే పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ సీపీఎంకు చేదు ఫలితాలే వచ్చాయి. కనీసం ఎక్కడా రెండో స్థానంలో కూడా నిలవలేకపోవడం గమనార్హం.

ఉడుం పట్టు

రాష్ట్ర కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించింది మొదలు కొత్తగూడెం నుంచి కచ్చితంగా పోటీ చేసి తీరుతామని కూనంనేని సాంబశివరావు చెబుతూ వచ్చారు. ఏ పార్టీతో పొత్తు కుదిరినా కొత్తగూడెంపై తేల్చాకే మిగతా చర్చలు ఉంటాయని చెప్పారు. అయితే సీట్ల కేటాయింపుపై కాంగ్రెస్ తాత్సారం చేయడంతో సీపీఎం వేరేదారి చూసుకుంది. దీంతో సీపీఐపై కూడా ఒంటరిగా పోటీ చేయాలనే ఒత్తిడి వచ్చినా... అనేక మెట్లు దిగొచ్చిన ఆ పార్టీ కనీసం కొత్తగూడెం సీటయినా ఇవ్వాలని కోరింది. మరోవైపు సీపీఐకి సీటు కేటాయిస్తే కూనంనేని పోటీ చేయడం సరికాదంటూ కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన ఆ పార్టీ ఐదుగురు కౌన్సిలర్లు తిరుగుబాటు చేశారు. ఆ తర్వాత పార్టీని వీడి గులాబీ కండువా కప్పుకున్నారు. చివరకు కూనంనేనికే టికెట్ ఖరారు కాగా, మిత్రపక్షాలైన కాంగ్రెస్, సీపీఎం నుంచి ఎంత వరకు సహకారం అందుతుందనే సందేహాలు ముసురుకున్నాయి. కానీ పోలింగ్‌కు పదిరోజుల ముందు నుంచి ఒక్కసారిగా సీపీఐ పార్టీ ప్రజల్లోకి ప్రబలంగా చొచ్చుకుపోయింది. కాంగ్రెస్ శ్రేణులను తమతో కలుపుకువెళ్లడంతో కొత్తగూడెం నుంచి కూనంనేని ఘన విజయం సాధించారు.

'పొంగులేటి' చెయ్యేస్తే మాస్..!

- హస్తం అభ్యర్థుల విజయంలో శ్రీనివాసరెడ్డి శ్రమ
- మూడు స్థానాల్లో గెలిచిన పొంగులేటి వర్గీయులు
- కొత్తగూడెంలోనూ కనిపించిన పొంగులేటి ప్రభావం



కౌంటింగ్ కేంద్రం వద్ద అభివాదం చేస్తున్న పొంగులేటి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'అన్న చెయ్యేస్తే మాస్.. అన్న లుక్కేస్తే మాస్.. మమ మాస్..' అన్నట్లుగా ఎన్నికల ఫలితాల్లో పీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీరు కనిపించింది. జిల్లాలో తిరుగులేని మాస్ లీడర్‌గా ఉన్న ఆయన మరోసారి తన చరిష్మా చూపించారు.

బీఆర్ఎస్‌పై తిరుగుబాటుతో..

వైఎస్సార్ సీపీ ద్వారా రాజకీయ జీవితం ప్రారంభించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ సరైన ప్రాధాన్యత లభించక ఈ ఏడాది ఆరంభంలో తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్ఎస్ తరఫున ఒక్కరినీ అసెంబ్లీ గేటు తాకనివ్వనంటూ ఆయన విసిరిన సవాల్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత పొంగులేటి రాజకీయ ప్రస్థానం ఏ దిశగా వెళ్తుందనేది చర్చనీయాంశంగా మారిన నేపథ్యాన బీజేపీలోకి వెళ్లాలని ఒత్తిళ్లు వచ్చాయి. కానీ రాజకీయంగా ఓసారి దెబ్బతిన్న ఆయన తొందరపాటు నిర్ణయాలకు పోకుండా ఆచితూచి అన్ని అంశాలు బేరీజు వేసుకుని కాంగ్రెస్‌లో చేరారు.

తగ్గేదే లే...

కాంగ్రెస్‌లో చేరే సమయంలో పదింట ఎనిమిది సీట్లు పొంగులేటి వర్గీయులకే ఇస్తారనే ప్రచారం జరిగినా అది కార్యరూపం దాల్చలేదు. కమ్యూనిస్టుల కోసం కొత్తగూడెం సీటు వదులుకోవాల్సి వచ్చింది. పాలేరు, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట సీట్లు పొంగులేటి వర్గానికి దక్కాయి. గత అనుభవాలు నేర్పిన పాఠంతో ఓర్పుగా ఒక్కో ఇటుక పేర్చుకుంటూ పోయారు. ఓవైపు తన నియోజకవర్గంలో ప్రచారం చేస్తూనే తన అనుయాయుల గెలుపు కోసం అహర్నిశలూ శ్రమించారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేటలో కాంగ్రెస్ అభ్యర్థుల గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగింది. అంతేకాదు పొంగులేటి ఎంట్రీ ఇచ్చేవరకు కొత్తగూడెంలో సీపీఐ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఆశించిన స్థాయిలో సఖ్యత కనిపించలేదు. ఒక్కసారి శ్రీనివాసరెడ్డి రాకతో పరిస్థితి మారిపోయింది. ఐకమత్యమే మహాబలం అన్నట్టుగా ఇరు పార్టీల కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేశారు. క్రాస్ ఓటింగ్‌కు అవకాశమే లేకుండా జాగ్రత్త పడ్డారు. వెరసి నాలుగు స్థానాల్లో విజయఢంకా మోగించడమే కాదు మెజార్టీలోనూ దుమ్ము రేపారు.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామివారిని ఈ రూపంలో ఆలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేత, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కార్తీక సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామయ్యను దర్శించుకున్నారు.

సమష్టి కృషితోనే నాలుగు స్థానాల్లో గెలుపు

సింగరేణి(కొత్తగూడెం): కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీడీపీ, టీజేఎస్ పక్షాల సమష్టి కృషితోనే జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాష తెలిపారు. సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలు అర్హులకు అందేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పాలన సాగించే వారిని తిరస్కరిస్తామని ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయన్నారు.

'ఓపెన్' ఫలితాలు విడుదల

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో గత అక్టోబర్‌లో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో – ఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారొక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 439 మంది హాజరు కాగా 71 మంది ఉత్తీర్ణులయ్యారని(16.17 శాతం), ఇంటర్మీడియట్ పరీక్షలకు 443 మంది హాజరు కాగా 191 మంది(43.12 శాతం) ఉత్తీర్ణత సాధించారని వివరించారు. పరీక్ష ఫలితాలను www.telanganaopenschool.org వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కావాలనుకునే వారు ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు పైన ఇచ్చిన వెబ్‌సైట్‌లో లేదా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ

అశ్వారావుపేటరూరల్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధన చేయడంతో పాటు ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ డి.వెంకటేశ్వరాచారి సూచించారు. మండలంలోని మామిళ్లవారిగూడెం, అశ్వారావుపేట ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు పరస్పరం చర్చించుకోవడం ద్వారా బోధనా మెళకువలను పెంచుకోవచ్చని చెప్పారు. విద్యా శాఖ అమలు చేస్తున్న తొలిమెట్టు కార్యక్రమం విజయవంతం కావాలంటే ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా ఉండాలని, డిజిటల్ పద్ధతులు అనుసరించాలని అన్నారు. ఆయా పాఠశాలల్లో ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలు తీరు, పాఠశాలల ప్రణాళికలు పరిశీలించారు. అనంతరం స్థానిక బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేకావసరాలు గల విద్యార్థులకు వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, మండల నోడల్ అధికారి ఎం. ప్రసాద్‌రావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.హరిత, సీఆర్పీలు ప్రభాకరాచార్యులు, హనుమంతు, నాగేశ్వరరావు, మల్లేష్ పాల్గొన్నారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి : మండలకేంద్రంతోపాటు, జగన్నాథపురం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ స్థాయి టీసీ తరగతులను జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీసీ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎంఓ నాగరాజుశేఖర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాలయానికి 'ముక్కోటి' శోభ



భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 13వ తేదీ నుంచి ముక్కోటి ఉత్సవాలు జరగనుండగా, అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా రామాలయం గాలిగోపురానికి విద్యుత్ బల్బులను అమర్చారు. ట్రయల్ రన్‌లో భాగంగా సోమవారం రాత్రి వీటిని వెలిగించడంతో భద్రాద్రికి ముక్కోటి శోభ వచ్చినట్లయింది. – భద్రాచలం

'మిచౌంగ్' కలవరం

- రైతులను వణికిస్తున్న తుపాను
- ముమ్మరంగా వరికోతలు, పత్తితీత పనులు
- పంట చేతికందేనా అని ఆందోళన



బూర్గంపాడులో పొలం కోయిస్తున్న రైతు

బూర్గంపాడు: పంటలు చేతికందే సమయంలో వచ్చిన తుపాన్ రైతుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. జిల్లాలో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతుండటంతో వణుకు మొదలైంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వరికోతలు, పత్తితీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో కురుస్తున్న వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాను ప్రభావం జిల్లాపై కూడా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తుండడంతో రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. సోమవారం సాయంత్రం నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షపు జల్లులు ప్రారంభమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఈ ఏడాది జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. అధికారులు పూర్తిగా ఎన్నికల విధుల్లోనే నిమగ్నం కావడంతో కొనుగోలు కేంద్రాల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఏడాది సన్నరకం ధాన్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో రైతుల వద్ద నుంచి ప్రైవేటు వ్యాపారులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం కొంత ఊరట కలిగిస్తోంది. దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికీ మొక్కుబడిగానే సాగుతున్నాయి. చాలాచోట్ల రైతులు కల్లాల్లోనే ధాన్యం ఆరబోసి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత తుపాను కారణంగా ఆరబోసిన ధాన్యం తడిచే ప్రమాదం నెలకొంది. వర్షాల బారి నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్లు అందించాలని రైతులు కోరుతున్నారు.

1.65 లక్షల ఎకరాల్లో వరి సాగు..

ఈ ఏడాది జిల్లాలో 1.65 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటివరకు సుమారు 65 వేల ఎకరాల్లో మాత్రమే పంట కోశారు. మిగతా పంటను కోస్తున్న తరుణంలో వస్తున్న తుపాను రైతులకు ప్రతిబంధకంగా మారుతోంది. ఇక జిల్లాలో 2.07 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ప్రస్తుతం రెండో విడత పత్తితీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో పత్తికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు సీసీఐ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అయితే సీసీఐ నిబంధనల కారణంగా పత్తి అమ్మకాలకు తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం చేల నిండా పత్తి పూసి తీసేందుకు సిద్ధంగా ఉంది. కానీ కూలీల కొరతతో పత్తితీత ఆలస్యం అవుతోంది. ఇప్పుడు తుపాన్ ప్రభావంతో చేతికందొచ్చిన పత్తి ఎలా ఉంటుందోననే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతుంది. అసలే ఈ ఏడాది పత్తికి గిట్టుబాటు ధర లేకపోగా దిగుబడులు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఈ తరుణంలో కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు పుండు మీద కారం చల్లినట్టుగా మారాయి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): తుపాను ప్రభావంతో జిల్లాలో వచ్చే మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, జిల్లా వ్యవసాయ వాతావరణ పర్యవేక్షకులు సుమన్ తెలిపారు. పంటల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

- వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వరి కోతలు చేపట్టాలి
- వరి కోతల తర్వాత ధాన్యం తడవకుండా పట్టాలు లేదా యూరియా బస్తాలను రాశులపై కప్పాలి.
- ఆరుతడి పంటలకు తాత్కాలికంగా నీరు అందించవద్దు.
- పురుగు మందులు, ఎరువులు ప్రస్తుతం వేయొద్దు
- మేకలు, గొర్రెలు, గేదెలు తదితర పశువులను షెడ్ల కింద మాత్రమే ఉంచాలి
- తడిసిన విద్యుత్ స్తంభాలను, కరెంట్ మోటార్లను ముట్టుకోవద్దు
- ఉరుములు, మెరుపుల సమయంలో మొబైల్ ఫోన్లు వాడొద్దు. టీవీలు చూడొద్దు.



క్లుప్తంగా

పగిలిన 'గాజు గ్లాస్'

అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించని పవన్‌కళ్యాణ్ ప్రభావం

చుంచుపల్లి: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన ప్రభావం జిల్లాలో ఎక్కడా కనుచూపుమేరలో కనిపించలేదు. ఆ పార్టీ గుర్తు గాజు గ్లాస్ పూర్తిగా పగిలిపోయింది. జిల్లాలో పోటీ చేసిన రెండు స్థానాల్లో కనీస ఓట్లకు కూడా నోచుకోలేదు. బీజేపీతో పొత్తులో భాగంగా జిల్లాలో కొత్తగూడెం, అశ్వారావుపేట స్థానాల్లో జనసేన అభ్యర్థులు లక్కినేని సురేందర్‌రావు, ముయ్యబోయిన ఉమాదేవి పోటీ చేశారు. వీరిలో కొత్తగూడెం అభ్యర్థికి 1,945 ఓట్లు, అశ్వారావుపేటలో 2,281 ఓట్లు మాత్రమే లభించాయి. ఇక జనసేనతో జత కట్టిన బీజేపీకి సైతం ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదు. పినపాక, భద్రాచలం, ఇల్లెందు స్థానాల్లో ఆ పార్టీ పోటీ చేయగా, ఎక్కడా ఓట్లు మూడు వేలకు దాటలేదు. ప్రచారంలో భాగంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కొత్తగూడెంలో ప్రచారం నిర్వహించినా ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాల్వంచ: మండల పరిధిలోని శ్రీ కనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో సోమవారం కాంగ్రెస్ నాయకులు పూజలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని పార్టీ అధికారంలోకి రావడంతో పాటు సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం సాధించడంతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం జగన్నాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, జగన్నాథపురం సర్పంచ్ అనిత, మండల అధ్యక్షుడు కొండం వెంకన్న, మాజీ జెడ్పీటీసీ నందానాయక్, బాలినేని నాగేశ్వరరావు, బాదర్ల జోషి, వీసంశెట్టి శ్రీనివాసరావు, గంధం నరసింహారావు, కందుకూరి రాము, పులి సత్యనారాయణ, రమేశ్, మంగయ్య, బాలాజీ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

రాష్ట్రంలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థి



హర్షకమల్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

పాల్వంచ : ఈనెల 2వ తేదీన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన ఎస్జీఎఫ్ఐ అండర్ – 17 ఆర్చరీ పోటీల్లో కిన్నెరసాని క్రీడా పాఠశాల విద్యార్థి హర్షకమల్ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించాడు. ఈనెల 17, 18 తేదీల్లో గుజరాత్ రాష్ట్రం నోయిడాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపియ్యాడు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.చందు, పీడీ వీరూనాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

గాలిదుమారానికి కూలిన ఇల్లు



కుప్పకూలిన రేకులషెడ్డు

చండ్రుగొండ : మండలంలోని అయన్నపాలెం గ్రామంలో సోమవారం గాలిదుమారానికి గోగుల తిరుమలరావు అనే వ్యక్తి రేకులషెడ్డు కుప్పకూలింది. తుఫాన్ నేపథ్యంలో వీచిన గాలిదుమానికి రేకులషెడ్డు పడిపోయింది. రేకులతోపాటు ఇంట్లో సామగ్రి పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. రూ. 50 వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

మద్యం స్వాధీనం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బెల్ట్‌షాపులో విక్రయిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతర జిల్లాల నుంచి తీసుకొచ్చిన మద్యాన్ని విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 50 క్వార్టర్ సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై శంకర్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

రైతుల మొగ్గు మద్దతు ధర వైపే

సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్మకానికి సిద్ధం

- ప్రైవేట్ మార్కెట్‌లో రూ.6,500కు మించని ధర
- సీసీఐలో తేమ శాతం ఆధారంగా రూ.7,020
- ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న సీసీఐ కొనుగోళ్లు



ఖమ్మం రూరల్ మండలంలోని మిల్లులో పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న సీసీఐ బయ్యర్లు, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: పత్తి రైతులకు ఈ సీజన్ అంతా ప్రతికూలంగానే ఉంది. ఓ వైపు ప్రకృతి కరుణించక వానలు లేక పంట దిగుబడులు గణనీయంగా తగ్గగా, మరోవైపు అరకొరగా పండించిన పంటకు ధర లభించని పరిస్థితి నెలకొంది. గత ఏడాది ఓ దశలో గరిష్టంగా క్వింటాల్‌కు రూ.13 వేల వరకు ధర పలకగా, ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితులు రైతులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పత్తి ధర ప్రైవేట్ మార్కెట్‌లో క్వింటాకు గరిష్టంగా రూ. 6,500కు మించి పలకటం లేదు. జాతీయంగా, అంతర్జాతీయంగా పత్తి పంట ఉత్పత్తులైన గింజ, బేలుకు ఆశించిన డిమాండ్ లేకపోవటంతో ధర క్షీణించిందని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా కేంద్రం ప్రభుత్వం వివిధ రకాల పంటలకు ధరలను నిర్ణయించింది. పత్తికి తేమశాతం ఆధారంగా గరిష్టంగా రూ.7,020గా నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లాలో 3.85 లక్షల ఎకరాల్లో సాగు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రధాన పంటల్లో పత్తి ఒకటి. వర్షాధారంగా, నీటి వనరుల ఆధారంగా ఈ జిల్లాల్లో పత్తిని సాగు చేస్తారు. ఈ ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 3,85,598 ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. గత ఏడాది ధరలను పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది రైతులు పత్తి సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే సమయానికి వానలు లేకపోవటంతో ఆశించిన స్థాయిలో పంటను సాగు చేయలేకపోయారు. ఖమ్మం జిల్లాలో సాగు చేసిన 1,85,225 ఎకరాల నుంచి 1,38,918 మెట్రిక్ టన్నులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాగు చేసిన 2,00,373 ఎకరాల నుంచి 1,46,072 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

జిన్నింగ్ మిల్లుల్లోనే కొనుగోళ్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న జిన్నింగ్ మిల్లులను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాలుగా ఎంపిక చేసింది. ఖమ్మం జిల్లాలో 10, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4 జిన్నింగ్ మిల్లులను పత్తి కొనుగోలు కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లాలో ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడులో ఉన్న శ్రీ సాయి జిన్నింగ్ మిల్లు, కూసుమంచి మండలంలోని జీళ్లచెర్వులో ఉన్న దేదీప్య రామా కాటన్ ఇండస్ట్రీస్‌లలో పంట కొనుగోళ్లు చేయటం లేదు. మొత్తంగా ఖమ్మం జిల్లాలో 8 జిన్నింగ్ మిల్లుల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లను నిర్వహిస్తున్నారు. 8–12 తేమశాతం కలిగిన పత్తిని సీసీఐ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేస్తోంది.

17,911 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 17,911.895 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసింది. ఖమ్మం జిల్లాలోని 8 జిన్నింగ్ మిల్లుల్లో 11,546.220 మెట్రిక్ టన్నులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4 జిన్నింగ్ మిల్లుల్లో 6,365.675 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసింది. ప్రైవేటు మార్కెట్లలో ఆశించిన ధర లేకపోవటంతో రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 12,550 మెట్రిక్ టన్నులు, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్‌లో 4,699 మెట్రిక్ టన్నుల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ శాఖ లెక్కలు చెబుతున్నాయి. కొద్దిరోజులుగా రైతులు నిబంధనలు పాటిస్తూ జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సీసీఐ పత్తి కొనుగోళ్లకు సంబంధించి పైకం చెల్లింపులు కూడా వెంటవెంటనే జరుగుతున్నాయి. మూడు నుంచి ఐదు రోజుల్లో రైతుల ఖాతాల్లో సీసీఐ నగదును జమ చేస్తోంది.



పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు, సీసీఐ బయ్యర్లు

తేమ శాతం ఆధారంగా క్వింటాల్ పత్తి ధరలు

తేమ	ధర (రూ.ల్లో)
8 శాతం	7,020-00
9 శాతం	6,949-80
10 శాతం	6,879-60
11 శాతం	6,809-40
12 శాతం	6,739-20

ప్రైవేట్‌లో అంతంతే...

వ్యవసాయ మార్కెట్లలో, ప్రైవేట్‌గా వ్యాపారులు పత్తి క్వింటాకు గరిష్టంగా రూ.6,500కు మించి ధర పెట్టడం లేదు. నాణ్యత తక్కువగా ఉన్నా, తేమ ఉన్నా రూ.5 నుంచి రూ.6వేలకు మించి చెల్లించడం లేదు. పంట సీజన్ ఆరంభంలో రూ. 7 వేల వరకు పలికిన ధర క్రమంగా ధర క్షీణిస్తూ వస్తుంది. పంట నాణ్యత పెరుగుతున్నా ధర తగ్గుతుందే తప్ప పెరగటం లేదు. ప్రైవేటు మార్కెట్‌లో పత్తి ధరలను గమనించిన ప్రభుత్వం సీసీఐని రంగంలోకి దింపింది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు దోహదపడుతున్నాయి.

సీసీఐ కేంద్రాలను వినియోగించుకోవాలి



ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సీసీఐ ద్వారా జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తుంది. 8–12 వరకు తేమశాతం ఉండే విధంగా రైతులు ఆరబెట్టుకొని నిర్దేశించిన జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని అమ్ముకొని మద్దతు ధర పొందవచ్చు.

– ఎం.ఏ.అలీం, ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

కేఎల్ మొదలు కోరం వరకు..

టేకులపల్లి నుంచి చట్టసభలకు ఎన్నిక

టేకులపల్లి: టేకులపల్లి మండలం ఇల్లెందు నియోజకవర్గానికి ఎమ్మెల్యేలను, జిల్లాకు జెడ్పీ చైర్మన్లను అందించే కేంద్రంగా మారింది. ఇల్లెందు నియోజకవర్గం పరిధిలోని టేకులపల్లి మండలం బేతంపూడికి చెందిన కొండపల్లి లక్ష్మీనరసింహారావు(కేఎల్), ముత్యాలంపాడు గ్రామానికి చెందిన కొమరం రామయ్య, కోయగూడెం గ్రామానికి చెందిన పూనెం రామచంద్రయ్య, లచ్చగూడెం గ్రామానికి చెందిన దొడ్డ నర్సయ్య, కోయగూడేనికి చెందిన కోరం కనకయ్య, దాసు తండాకు చెందిన బానోతు హరిప్రియ ఇల్లెందు, బూర్గంపాడు నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1952 నుంచి పూర్వ బూర్గంపాడు నియోజకవర్గానికి తొలుత ఎమ్మెల్యేగా దొడ్డ నర్సయ్య, కొమరం రామయ్య, పూనెం రామచంద్రయ్య (1978) వరుసగా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరంతా టేకులపల్లి మండల వాసులే కావడం విశేషం. కేఎల్ 1952, 1957, 1962 ఎన్నికల్లో గెలుపొందగా, ఆయన 2011లో మృతి చెందారు. ఇక 1957లో దొడ్డ నర్సయ్య ఇల్లెందు ఎమ్మెల్యేగా స్వల్పకాలం చేశారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన కోరం కనకయ్య విజయం సాధించగా, టీడీపీ నుంచి పోటీ చేసిన బానోతు హరిప్రియ ఓడిపోయారు. ఇక 2018లో కాంగ్రెస్ నుంచి హరిప్రియ, బీఆర్ఎస్ నుంచి కనకయ్య పోటీ చేస్తే హరిప్రియకు విజయం దక్కింది. ప్రస్తుతం ఎన్నికల్లో మళ్లీ కనకయ్య కాంగ్రెస్ నుంచి, హరిప్రియ బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే కనకయ్యను విజయంవరించింది. ఈ విజయంతో కనకయ్య రెండోసారి గెలిచినట్లయింది.



కొమరం రామయ్య



దొడ్డ నర్సయ్య



కేఎల్. నరసింహారావు



పూనెం రామచంద్రయ్య





కోరం కనకయ్య, బానోతు హరిప్రియ

గెలిచిన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధు
- శ్రేణులకు పార్టీ అండగా ఉంటుంది : నాగరాజు



మాట్లాడుతున్న తాత మధు, పక్కన కూరాకుల, నాగరాజు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల్లో ప్రజలు తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తామని, అధికార పక్షానికి పూర్తిగా సహకరిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ వెల్లడించారు. అలాగే, గెలిచిన ఎమ్మెల్యేలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధు మాట్లాడుతూ అరవై రోజులుగా అవిశ్రాంతంగా పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులు అభినందనీయమని చెప్పారు. ప్రజలు మార్పు కావాలని కోరుకున్న నేపథ్యాన వారి నిర్ణయాన్ని గౌరవప్రదంగా స్వీకరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, ఆయన దుగుజాడల్లో హుందాగా వ్యవహరిస్తామని తెలిపారు. కాగా, కేసీఆర్ సారథ్యాన బీఆర్ఎస్ కొనసాగించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని సూచించారు. ఆ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ నాయకులంతా ప్రజలతోనే ఉంటూ, వారి సంక్షేమం కోసం పాటుపడతామని మధు తెలిపారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం : నాగరాజు

బీఆర్ఎస్ అధికారం కోల్పోయినంత మాత్రాన పార్టీ శ్రేణులు అధైర్య పడవద్దని పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు సూచించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. తమ పార్టీ శ్రేణులు కొందరితో కాంగ్రెస్ నాయకులు బెదిరింపు ధోరణి అవలంభిస్తున్నట్లు తెలిసిందని చెప్పారు. ఈనేపథ్యాన పార్టీ శ్రేణులకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు గుండాల కృష్ణ, ఉప్పల వెంకటరమణ, చింతనిప్పు కృష్ణచైతన్య, జక్కుల లక్ష్మి, డోకుపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాదే అసలైన యూనియన్..

టీఎన్జీవోస్ కార్యాలయంలో ఇరువర్గాల గొడవ



టీఎన్జీవోస్ కార్యాలయం వద్ద ఇరువర్గాల నడుమ తోపులాట దృశ్యం

ఖమ్మంసహకారనగర్: అసలైన యూనియన్ తమదేనంటూ టీఎన్జీవోస్‌కు సంబంధించిన రెండు వర్గాల వారు గొడవకు దిగారు. గతంలో జిల్లా కార్యదర్శిగా పనిచేసిన గంగవరపు బాలకృష్ణ, నగర అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు తదితరులతో కలిసి సోమవారం టీఎన్జీవోస్ కార్యాలయం వద్ద వెల్లడించారు. ఇంతలోనే అక్కడకు ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్, తదితరులు చేరుకున్నారు. ఈక్రమంలో యూనియన్ తమదేనంటే, కాదు తమదని ఇరువర్గాల వారు వాదించుకోగా తోపులాట జరిగింది. చివరికి ఇరువర్గాల వారు సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని నిర్ణయించుకుని వెళ్లిపోయారు.

ఎవరేం అన్నారంటే....

టీఎన్జీవోస్ కేంద్ర సంఘం తొలుత అడహక్ కమిటీ కన్వీనర్‌గా తనను నియమించగా, ఆతర్వాత తాలూకా యూనిట్ల ఎన్నికలు నిర్వహించి జిల్లా అధ్యక్షుడిగా ఎంపికయ్యానని అఫ్జల్‌హసన్ తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 24వరకుతన పదవీకాలం ఉందని చెప్పారు. అయినా కార్యాలయంపై దాడిచేయడం సరికాదన్నారు. ఈసమావేశంలో సదర్శన్ పాల్, నాగుల్‌మీరా, స్వప్న, కట్టా నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఇక గంగవరపు బాలకృష్ణ మాట్లాడుతూ టీఎన్జీవోస్ బాధ్యులం తామేనని, తమనే గతంలో జిల్లా, నగర బాధ్యులుగా రాష్ట్ర నాయకత్వం నియమించిందని తెలిపారు. కానీ నాటి పరిస్థితుల నేపథ్యాన మౌనంగా ఉండడంతో వివిధ ప్రాంతాలకు బదిలీ చేసి ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. అయినా తమ సంఘాన్ని రద్దు చేసినట్లు కానీ, కొత్త వారిని నియమించినట్లుగా కానీ ఆధారాలు చూపించకుండా సంఘం బాధ్యులుగా కొందరు చెప్పుకోవడం సరికాదని తెలిపారు. ఆయన వెంట గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాస్, వీణ, తాళ్లూరి శ్రీకాంత్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సినీఫక్కీలో మొబైల్ చోరీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ వ్యక్తి నుంచి సినీఫక్కీలో మొబైల్ చోరీ చేసిన ఘటన ఇది. స్థానికంగా బైక్ మెకానిక్ షోరూం నిర్వహిస్తున్న రఫీ వద్దకు సోమవారం ఇద్దరు యువకులు వచ్చారు. అందులో ఒకరు స్కూటీ దిగి లోపలకు వచ్చి అక్కడ ఉన్న రూ.40 వేల విలువైన తీసుకుని స్కూటీపై ఎక్కగా ఇద్దరూ వేగంగా పారిపోయారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కాగా, బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

జూలూరుపాడు: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఏఎస్సై తిరుపతిరావు కథనం ప్రకారం.. మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన బానోత్ భీమ్లా(65) మద్యం తాగడానికి భార్యను డబ్బులు అడిగితే ఇవ్వలేదు. దీంతో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న భీమ్లాను కుటుంబసభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య హస్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బాలికల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఏటీడబ్ల్యూఓ

దుమ్ముగూడెం : మండలంలోని గౌరారం ఆశ్రమ పాఠశాల బాలికలు వరంగల్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీలకు తరలివెళ్లారు. 10వ తరగతి విద్యార్థిని కుంజ సమ్మక్క 1500 మీటర్లు, 3000 మీటర్ల రన్నింగ్, 9వ తరగతి విద్యార్థిని బుద్దుల అనూష, మడకం జేష్ఠవి 400, 800 మీటర్ల పరుగుపందెం పోటీల్లో పాల్గొననున్నారు. సత్తా చాటి పతకాలు గెలుచుకోవాలని ఏటీడబ్ల్యూఓ నరసింహారావు ఆకాంక్షించారు.

పాఠశాలకు ఉపాధ్యాయులు దుమ్మా

మండలంలోని పైదిగూడెం గ్రామంలోని రాజుగుంపు జీపీఎస్ పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలకు దుమ్మా కొట్టిన విషయం ఏటీడబ్ల్యూఓ నరసింహారావు పరిశీలనలో వెలుగు చూసింది. హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు ఇద్దరూ పాఠశాలకు వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి అనుమతి లేకుండానే బయటకు వెళ్లిపోయారు. పాఠశాలలో వర్కర్ మాత్రమే ఉండటంతో ఆమె నుంచి వివరాలు తీసుకుని ట్రైబల్ వెల్ఫేర్ డీడీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఏటీడబ్ల్యూఓ తెలిపారు.

వేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలు

ఖమ్మంలీగల్: భార్యను వేధించిన కేసులో ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడుకు చెందిన కొమ్ము సుధాకర్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొబైల్‌కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి ఆర్.శాంతిలత సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... ఖమ్మం ఎన్ఎస్‌టీ రోడ్డు ప్రాంతానికి చెందిన వెంకటలక్ష్మికి సుధాకర్‌తో వివాహం జరిగింది. వీరికి ఒక పాప జన్మించగా, ఆయన ఏ పనీ చేయకుండా నిత్యం తాగొచ్చి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, భర్తకు అత్త సత్యవతి కూడా తోడై ఇబ్బంది పడుతోందని 2016 జనవరి 22న వెంకటలక్ష్మి ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతోఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించాక సుధాకర్‌పై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధించగా, సత్యవతిపై కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వి.నర్సయ్య వాదించగా.. సీడీఓ ఎం.హరిబాబు సహకరించారు.

బండి తీయమన్నందుకు మహిళా కానిస్టేబుల్‌తో వాగ్వాదం

రఘునాథపాలెం: వాహనాన్ని అడ్డుగా తీయాలని సూచించిన మహిళా కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించిన లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు రఘునాథపాలెం సీఐ శ్రీధర్ తెలిపారు. రఘునాథపాలెం స్టేషన్‌కు వచ్చిన మండలంలోని పంగిడికి చెందిన లారీ డ్రైవర్ బానోత్ చందర్ తన ద్విచక్ర వాహనాన్ని అడ్డుగా నిలిపాడు. దీంతో మహిళా కానిస్టేబుల్ ఆయనను బైక్‌ను పక్కగా పార్క్ చేయాలని సూచించింది. ఈమేరకు ఆయన దురుసుగానే కాక, అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపినట్లు సీఐ తెలిపారు.

ఆపన్నహస్తం అందించండి

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ యువకుడు
- ఆర్థికసాయం కోసం కుటుంబ సభ్యుల వేడుకోలు



టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన యువకుడి వైద్యం కోసం కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని సులానగర్ గ్రామానికి చెందిన బోడ సుబ్రహ్మణ్యం–చిలికి దంపతుల కుమారుడు హరికి లలిత అనే యువతితో వివాహమైంది. ప్రస్తుతం వీరికి ఏడాది వయస్సున్న పాప ఉంది. హరి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండగా, గత నెల 24న రాత్రి ప్రమాదానికి గురయ్యాడు. టేకులపల్లి నుంచి స్వగ్రామం సులానగర్ వెళుతుండగా ముత్యాలంపాడు క్రాస్ రోడ్ వద్ద ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తలకు బలమైన గాయంకావడంతో మెదడులో రక్తం గడ్డ కట్టి సమస్య ఏర్పడిందని, సుమారు రూ.ఏడు లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారని కుటుంబీకులు తెలిపారు. తమను ఆర్థికంగా ఆదుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హరి ప్రాణాలు కాపాడాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఆర్థిక సాయం చేయదలచినవారు 86399 72872 (కేశోతు సాయి కుమార్) నంబర్‌కు ఫోన్ పే చేయాలని విజ్ఞప్తి చేశారు.



చికిత్స పొందుతున్న హరి



ఆర్థిక సాయం చేయాలని వేడుకుంటున్న క్షతగాత్రుడి తల్లి, భార్య

బీరు సీసాతో హత్యాయత్నం

పాల్వంచ: పాత కక్షల నేపథ్యంలో మద్యం తాగి గొడవ పడి బీరు సీసాతో హత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని యానంబైల్ గ్రామంలో ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో కంటెం ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి బొడ్రాయి సెంటర్ నుంచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బల్లె రాంబాబు అనే వ్యక్తి మద్యం తాగి బూతు మాటలతో గొడవ పడ్డాడు. దీంతో ఇద్దరికి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. దీంతో రాంబాబు బీరు సీసా పగులగొట్టి ప్రవీణ్‌కుమార్ కడుపు, ఛాతీ భాగంలో పలుమార్లు పొడిచాడు. దీంతో గాయాలై రక్తస్రావమైంది. స్థానికులు గమనించి పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా రాంబాబు తిరిగి ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులపై కూడా గొడవ పడ్డాడు. ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ కార్తీక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాంబాబు పరారీలో ఉన్నాడు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ములకలపల్లి : ఆన్‌లైన్‌లో నగదు పంపితే లాభం కలిపి చెల్లిస్తామని చెప్పిన మాయమాటలు నమ్మి ఓ యువకుడు వేలాది రూపాయలు నష్టపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రాజుపేట గ్రామానికి చెందిన గుంట్రు కోటేశ్వరరావుకు 90062 85420 నుంబర్ నుంచి టెలిగ్రామ్ ద్వారా ఫోన్‌కాల్ వచ్చింది. కొంత డబ్బు చెల్లిస్తే లాభం కలిపి తిరిగి పంపుతామని ఫోన్ చేసిన వ్యక్తులు నమ్మించారు. దీంతో కోటేశ్వరరావు పలుదఫాలుగా రూ. 71,396 రూపాయలు చెల్లించాడు. అనంతరం స్పందించకపోవడంతో మోసపోయానని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

ములకలపల్లి : కత్తితో చంపుతానని బెదిరించిన వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కమలాపురం గ్రామానికి చెందిన ఊరబెద్ది వెంకన్న ఆదివారం రాత్రి తన ఇంటిముందు ఉండగా, అదే గ్రామానికి చెందిన గొగ్గల నవ్యకృష్ణ అనే యువకుడు అక్కడికి వచ్చాడు. చేతిలో ఉన్న కత్తితో వెంకన్నను చంపుతానని బెదిరించాడు. బూతులు తిడుతూ భయభ్రాంతులకు గురిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా...

ఐదు జిల్లాల్లో దుర్గమ్మ ప్రచార రథయాత్ర

ఈ నెల 6న ప్రారంభం..
24న ముగింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో ఐదు జిల్లాల్లో ప్రచార రథయాత్ర నిర్వహించేందుకు దేవస్థానం నిర్ణయం తీసుకుంది. శోభకృత నామ సంవత్సర భవానీ దీక్షలను పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దుర్గమ్మ ప్రచార రథయాత్ర అనంతపురం జిల్లా, శ్రీసత్యసాయి జిల్లా, వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లా, శ్రీకాకుళం జిల్లాలో సాగనుంది. ఈ మేరకు రూట్‌మ్యాప్‌ను ఆలయ వైదిక కమిటీ నిర్ణయించి ఈవో కె.ఎస్.రామారావుకు అందజేసింది. ప్రచార రథయాత్రలో నిత్యం ఆది దంపతులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల్లో చండీ హోమం, కుంకుమార్చనతో పాటు శాంతి కల్యాణం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రచార రథ యాత్రపై ఇప్పటికే ఆయా జిల్లాల్లోని గ్రామపెద్దలు, గురు భవానీలు, భక్త సమాజాలకు సమాచారం ఇచ్చారు. ఆయా గ్రామాల్లో గ్రామోత్సవంతో పాటు పలు వైదిక కార్యక్రమాలను నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది.

ఎస్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్..



జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్-1, యూనిట్-2లో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. యూనిట్-1లో పలు సాంకేతిక కారణాలతో గత నెల 20 నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి మరమ్మతు చేస్తున్నారు. యూనిట్-2లో ట్యూబ్ లీకేజీల కారణంగా ఈ నెల ఒకటి నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయడంతో రెండు యూనిట్లల్లోనూ ఉత్పత్తి పూర్తిగా స్తంభించింది. యూనిట్-2 నుంచి విద్యుత్ ఉత్పత్తికి అధికార యంత్రాంగం అంతా రాత్రింబవళ్లు శ్రమిస్తుండగా మంగళవారం నాటికి ప్రారంభించనున్నట్లుగా తెలుస్తోంది. కాగా, ఒక్కో యూనిట్ నుంచి సుమా రు 13.6 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన రెండు యూనిట్లలో ఉత్పత్తి నిలిచిపోవడంతో రోజుకు సుమారు రూ.14 కోట్లకుపైగా నష్టం వాటిల్లుతోంది.

24% పెరిగిన సైబర్ నేరాలు

సాక్షి, హైదరాబాద్: దేశంలో సైబర్ నేరాల నమోదు ఏటా పెరుగుతోంది. 2021తో పోలిస్తే దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నమోదు 2022లో 24.4 శాతం పెరిగినట్లు జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)-2022 నివేదిక వెల్లడించింది. సైబర్ నేరాల నమోదులో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో నిలిచిందని పేర్కొంది. 2021తో పోలిస్తే 2022లో సైబర్ నేరాల నమోదు తెలంగాణలో 40 శాతం పెరిగిందని వివరించింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని రకాల నేరాల నమోదు 4.5 శాతం తగ్గినట్లు నివేదిక తెలిపింది. ఎన్‌సీఆర్‌బీ-2022 వార్షిక నివేదికను కేంద్ర హోంశాఖ సోమవారం విడుదల చేసింది. ఏటా జూలై లేదా ఆగస్టు వరకు ఈ నివేదిక విడుదల చేస్తుండగా ఈసారి ఎన్‌సీఆర్‌బీ నివేదిక విడుదలలో దాదాపు 5 నెలలపాటు జాప్యమైంది.

2022లో దేశవ్యాప్తంగా 65,893 సైబర్ కేసుల నమోదు

- సైబర్ నేరాల నమోదులో 40 శాతం పెరుగుదలతో మొదటి స్థానంలో తెలంగాణ
- దేశవ్యాప్తంగా మహిళలపై నేరాల్లో 4 శాతం పెరుగుదల.. అన్ని నేరాల్లో 4.5 శాతం తగ్గుదల
- జాతీయ నేర గణాంకాల బ్యూరో-2022 నివేదిక వెల్లడి



58.24 లక్షల కేసులు...

ఎన్‌సీఆర్‌బీ తాజా నివేదిక ప్రకారం ఐపీసీ, స్పెషల్ లోకల్ లా (ఎస్ఎల్ఎల్) సెక్షన్ల కింద కలిపి 2021లో మొత్తం 60,96,310 కేసులు నమోదవగా 2022లో అన్ని రకాల నేరాలు కలిపి 4.5 శాతం తగ్గుదలతో 58,24,946 కేసులు నమోదయ్యాయి. ప్రతి లక్ష మందికి నేరాల నమోదు పరిశీలిస్తే 2021లో 445.9 నేరాలు నమోదుకాగా 2022లో ఆ సంఖ్య 422.2కు తగ్గింది. దేశవ్యాప్తంగా మహిళలపై నేరాల్లో 4 శాతం, చిన్నారులపై నేరాల్లో 8.7 శాతం, వృద్ధులపై నేరాల్లో 9.3 శాతం, ఎస్సీలపై నేరాల్లో 13.1 శాతం, ఎస్టీలపై నేరాల్లో 14.3 శాతం, ఆర్థిక నేరాల్లో 11.1 శాతం పెరుగుదల నమోదైంది. అదే సమయంలో తెలంగాణలో ఐపీసీ, ఎస్ఎల్ఎల్ చట్టాల కింద నమోదైన అన్ని రకాల కేసుల నమోదు చూస్తే కేసుల నమోదు సంఖ్య పెరిగింది. 2021లో 1,58,809 కేసులు నమోదవగా 2022లో రాష్ట్రవ్యాప్తంగా 1,65,830 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో 2022లో నమోదైన కేసుల్లో 79.7 శాతం కేసులలో చార్జిషీట్లు దాఖలయ్యాయి.

రాష్ట్రంలో సైబర్ క్రైం పైపైకి...

తెలంగాణలో 2022లో మొత్తం 15,272 సైబర్ నేరాలు నమోదవగా 2021లో మొత్తం 10,303 కేసులు నమోదైనట్లు నివేదిక వెల్లడించింది. 2021తో పోలిస్తే తెలంగాణలో 2022లో 40 శాతం మేర సైబర్ కేసులు నమోదు పెరిగినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా 2022లో మొత్తం 65,893 సైబర్ నేరాలు నమోదుకాగా, 2021లో 52,974 కేసులు నమోదయ్యాయని ఎన్‌సీఆర్‌బీ నివేదిక తెలిపింది. 2021తో పోలిస్తే 2022లో సైబర్ నేరాలపై కేసుల నమోదు 24.4% పెరుగుదల ఉంది. 2022లో నమోదైన సైబర్ నేరాలను పరిశీలిస్తే 64.8 శాతం (42,710 కేసులు) సైబర్ నేరాలకు కారణం మోసం చేసే ఉద్దేశమని నివేదిక తేల్చింది. ఆ తర్వాతి స్థానంలో 5.5 శాతం (3,648 కేసులు) బెదిరింపులకు సంబంధించినవి, లైంగిక దోపిడీ కారణమైన సైబర్‌నేరాలు 5.2 శాతం (3,434 కేసులు) ఉన్నట్లు వెల్లడించింది. సైబర్ నేరాల నమోదులో తెలంగాణ తర్వాత స్థానంలో కర్ణాటక (18.6 శాతం), మహారాష్ట్ర (6.6 శాతం) ఉన్నాయి.

ఇతర నేరాలు ఇలా...

రాష్ట్రంలో మహిళలపై నేరాల సంఖ్య పెరిగింది. 2021లో 20,865 కేసులు నమోదవగా 2022లో అవి 22,066కు పెరిగాయి. మానవ అక్రమ రవాణా కేసులు 2022లో దేశవ్యాప్తంగా 2,250 కేసులు నమోదవగా 391 కేసుల నమోదుతో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర (295), బిహార్ (260) నిలిచాయి. హత్య కేసుల సంఖ్య 2022లో తెలంగాణలో తగ్గింది. 2021లో 1,026 హత్య కేసులు నమోదవగా 2022లో ఆ సంఖ్య 337కు తగ్గింది. వాటిలో వివాహేతర సంబంధాల కారణంగా 116 హత్యలు జరిగినట్లు నివేదిక వెల్లడించింది.

హైదరాబాద్‌లో బీఆర్‘ఎస్’ బయట కాంగ్రెస్

- ముస్లిం మైనారిటీ ఓటర్ల తీరులో మార్పు!
- క్షేత్రస్థాయి పరిశీలనలోనే గుర్తింపు.. పోస్ట్ పోల్ సర్వేలదీ అదే మాట

సాక్షి, హైదరాబాద్: దశాబ్ద కాలంగా బీఆర్ఎస్‌కు అండగా ఉంటూ వచ్చిన ముస్లిం మైనారిటీల తీరులో మార్పు వచ్చినట్టు తాజా ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. మజ్లిస్ పోటీ చేసే స్థానాల్లో ఆ పార్టీకి ఏకపక్షంగా ఓట్లు వేస్తూ, మజ్లిస్ పోటీలో లేని స్థానాల్లో పూర్తిగా బీఆర్ఎస్ అభ్యర్థుల పక్షాన నిలిచే సంప్రదాయాన్ని పక్కన పెట్టినట్టు అవగతమవుతోంది. అయితే జంటనగరాలు, దాని శివారు ప్రాంత నియోజకవర్గాల్లో మాత్రం బీఆర్ఎస్‌నే ఆదరించారు. ఈ కారణంగానే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా హవా ప్రదర్శించినా జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం చేతులెత్తేసింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో మా త్రం ముస్లిం మైనారిటీలు.. ముందే చెప్పినట్టు సంప్రదాయాన్ని పక్కనబెట్టి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. ముస్లిం ఓటర్లు గణనీయ సంఖ్యలో ఉన్న నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఇండియా టుడే నిర్వహించిన పోస్ట్ పోల్ సర్వేలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. హైదరాబాద్ వెలుపలి నియోజకవర్గాల్లో ముస్లింలు కాంగ్రెస్ పక్షాన నిలిచినట్లు వెల్లడించింది.

ఒవైసీ పిలుపును పట్టించుకోకుండా..

‘ఒవైసీ హైదరాబాద్ నేత. ఆయన అభ్యర్థులు అక్కడే గెలుస్తారు. ఆ ప్రాంత ముస్లిం ఓటర్లను ఆయన ప్రభావితం చేస్తారు. కానీ మాకు ఒవైసీతో సంబంధం లేదు. బీఆర్ఎస్‌కు ఓటేయాలన్న ఆయన పిలుపును కాకుండా మా ప్రాంత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మేం నిర్ణయం తీసుకుంటాం. ఈసారి కాంగ్రెస్‌కే ఓటేయాలని నిర్ణయించుకున్నాం..’ఇది ఇటీవల క్షేత్ర పరిశీలనలో పరిగి, తాండూరు లాంటి ప్రాంతాల్లో ముస్లిం ఓటర్లు ‘సాక్షి’తో చెప్పిన మాట. దానికి తగ్గట్టే ఇప్పుడు ఫలితాలు వచ్చాయి. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో ముస్లింల ప్రాబల్యం ఉన్న చోట్ల కాంగ్రెస్ గెలిచింది.

ఆ ప్రచారమే కారణమా?

‘ముస్లింలలో సింహభాగం గతంలో కాంగ్రెస్ పక్షానే నిలిచేవారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వారి తీరు మారింది. కేసీఆర్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి చర్యలు తీసుకోవటంతో వారు బీఆర్ఎస్ వైపు మళ్లారు. అయితే ఇటీవలి కాలంలో బీఆర్ఎస్-బీజేపీలు కలిసి పోయాయని, బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే నంటూ కాంగ్రెస్ గట్టిగా ప్రచారం చేస్తూ వచ్చింది. ‘మద్యం కేసు’కు సంబంధించి కవిత విషయంలో కేంద్రం వ్యవహరించిన తీరు, ఎన్డీయేలో చేరతానంటూ కేసీఆర్ స్వయంగా తన వద్దకు వచ్చారని ప్రధాని మోదీ పేర్కొనటం, బీజేపీ తీసుకొచ్చిన కొన్ని బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు తెలపటం.. లాంటి విషయాలను కాంగ్రెస్ జనంలోకి బలంగా తీసుకెళ్లింది. బీఆర్ఎస్-బీజేపీ దోస్తీ అంటూ ఆ పార్టీ చేసిన ప్రచారాన్ని ముస్లింలు నమ్మారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే హైదరాబాద్ వరకు మాత్రం బీఆర్ఎస్ వైపే నిలిచారని పేర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల్లో ముస్లింలు క్రమంగా కాంగ్రెస్‌కు చేరువవుతున్న తీరును గుర్తించే రేవంత్‌రెడ్డిపై ఆర్ఎస్ఎస్ ముద్ర వేసే ప్రయత్నం ఒవైసీ చేశారని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ మత కలహాలు పెరుగుతాయంటూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమేనని అంటున్నారు.

సాధికార మహోత్సవం

ప్రజల ఆదరాభిమానాలతో రాప్తాడులో దిగ్విజయంగా సామాజిక సాధికార బస్సు యాత్ర

- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన సభ

సాక్షి,అమరావతి/రాప్తాడు రూరల్: ఫ్యాక్షన్‌ను తోసిరాజని అనంతపురం జిల్లా రాప్తాడులో సామాజిక సాధికారత నినాదం మార్మోగింది. రాయలసీమ ప్రాంతంలో కీలక నియోజకవర్గం అయిన రాప్తాడులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల ఆదరాభిమానాలతో సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం అపూర్వ రీతిలో ఉత్సవంలా సాగింది. వేలాదిగా తరలి వచ్చిన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ ప్రజలు విజయయాత్ర చేశారు. ముఖ్యంగా మహిళలు కూడా పెద్దసంఖ్యలో తరలిరావడం విశేషం. సీఎం వైఎస్ జగన్ పాలనలో తమకు లభించిన ప్రాధాన్యతను, రాజ్యాధికారం పొందిన వైనాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం జరిగిన సభకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు పోటెత్తారు. సీఎం జగన్ నామస్మరణతో సభా ప్రాంగణం మార్మోగింది. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధించిన వైనాన్ని మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు వివరించినప్పుడు ప్రజలు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. ‘జగనన్నే మా భవిష్యత్తు.. 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగనే గెలవాలి .. జగనే కావాలి’ అంటూ ఒకే గళమై నినదించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



అనంతపురం జిల్లా రాప్తాడులో సామాజిక సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

జిల్లా వార్తలు

భద్రాద్రి ఆలయానికి కిలో వెండి విగ్రహం



ఈఓ రమాదేవికి విగ్రహం అందజేస్తున్న భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానానికి కోదండ సీతారామయ్య విగ్రహాన్ని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన భక్తులు సోమవారం సమర్పించారు. తిరువూరుకు చెందిన రాఘవ జ్యూయలరీ యజమాని ప్రనవ్‌రామ్-గిరిజ దంపతులు కిలో వెండితో చేయించిన విగ్రహాన్ని ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏజెన్సీలో ముమ్మరంగా పోలీసు తనిఖీలు



వారోత్సవాల నేపథ్యాన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చర్ల: మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యాన తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు చర్ల మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు పీఎల్‌జీఏ 23వ వారోత్సవాలను నిర్వహించాలంటూ మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఈ సమయాన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు నష్టం కల్గించడంతో పాటు విధ్వంసానికి దిగొచ్చన్న నిఘా వర్గాల సమాచారంతో సరిహద్దు అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపడుతున్నారు. అంతేకాకుండా రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ఆర్ కొత్తగూడెం, కలివేరు క్రాస్ రోడ్డు, తాలిపేరు ప్రాజెక్టు, లెనిన్ కాలనీ, దేవరాపల్లి తదితర గ్రామాల ప్రధాన రహదార్ల వెంబడి పోలీస్ బలగాలను మోహరించి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయా మార్గాల్లో వచ్చివెళ్లే ప్రతీ ఒక్కరిని తనిఖీ చేస్తూ, వివరాలు సేకరిస్తున్నారు. మావోయిస్టులు నిర్వహించే వారోత్సవాలకు ఎవరైనా వెళ్తున్నారా అనే అంశంపై కూపీ లాగుతున్నారు. ఈమేరకు సీఐ రాజగోపాల్ నేతృత్వాన తనిఖీలు కొనసాగుతుండగా పెద్దసంఖ్యలో సిబ్బంది పాల్గొంటున్నారు.

వీకే ఓసీ అనుమతుల్లో జాప్యం

- భూగర్భగని మూసేసి రెండు సంవత్సరాలు...
- మరో ఐదేళ్లు బొగ్గు ఉత్పత్తికి అవకాశం
- అయినా అధికారుల నిర్లక్ష్యంతో తెరుచుకోని వైనం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా కొత్తగూడెం ఏరియాలోని వీకే-ఓసీకి మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్ట్రీ(ఎంఓఎఫ్), పర్యావరణ అనుమతుల్లో జాప్యం జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంస్థకు తలమానికంగా, కొత్తగూడెం ఏరియాకు కొంగు బంగారంగా విరాజిల్లిన వీకే-7షాఫ్ట్ గనిని సుమారు రెండేళ్ల క్రితం మూసేశారు. చివరిరోజు కూడా 1,800 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగగా, భూగర్భ గనిలో ఇంకా ఐదేళ్ల వరకు బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు మూసివేయడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఈ గనిని ఓసీగా మార్చాలనే సంకల్పంతో మూసివేశారని చెబుతున్నారు.

చెట్టుకొకరు.. పుట్టకొకరు

ఉత్పత్తికి అవకాశమున్నా అధికారులు తీసుకున్న నిర్ణయంతో గని మూతబడగా, రెండేళ్ల కాలంలో కాలంలో తలోదిక్కుకు వెళ్లాల్సి వచ్చింది. కొత్తగూడెం ఏరియాలో నూతన గనులు తీసేందుకు అవకాశాలు ఉన్నా అటు యూనియన్ల నాయకులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గతంలో ఏరియాలోని 12బావుల్లో కార్మికులు పనిచేయగా, ఇప్పుడు ఒకే గని ఉండడంతో చాలా మందిని బదిలీ చేయడంతో కార్మిక వాడలు కళ కోల్పోయాయి. ఇకనైనా ఇటీవల సింగరేణి యాజమాన్యం సర్వే చేసిన రాంపురం, పెనగడప, పెనుబల్లి గనులను తిరిగి ప్రారంభించి ఏరియాకు పూర్వవైభవం తీసుకురావాలని కార్మికులు కోరుతున్నారు.

ప్రయోగాల గనిగా పేరు

తట్టా- చెమ్మస్ మొదలు ఆధునిక పరిజ్ఞానం ఏదైనా తొలుత వీకే-7షాఫ్ట్ గనిలో అమలుచేసేవారు. ఆతర్వాతే సింగరేణి వ్యాప్తంగా ప్రవేశపెట్టడం ఆనవాయితీగా కొనసాగింది. 1954లో ప్రారంభమైన తట్టా చెమ్మస్ తర్వాత 2014లో ఏర్పాటు చేసిన చైర్ కార్ వరకు అన్ని ఈ గని నుంచే ప్రారంభించారు. అలా ఈ గనికి ప్రయోగాల గనిగా పేరు గాంచింది. అంతేకాకుండా తొలి ప్రధాని నెహ్రూ, రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తదితర ప్రముఖులు ఈ గనిని సందర్శించారు.



వీకే - 7షాఫ్ట్ గని ద్వారం (ఇన్‌సెట్) గనిలో గ్యాస్ నివారించేందుకు ఏర్పాటు చేసిన సీఓ-2 ప్లాంట్

వీకే-7షాఫ్ట్ గని ప్రత్యేకతలు

1954లో సుమారు 1,300 మంది కార్మికులతో ఈ గని ప్రారంభమైంది. తట్టా, చెమ్మస్ ద్వారా రోజుకు మూడు షిఫ్టులలో 3వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగేది. 1974లో తొలిసారిగా మ్యాన్ వైండింగ్ షాఫ్ట్ ఏర్పాటుచేశారు. 1982లో ఎస్‌డీఎల్ ద్వారా బొగ్గు ఉత్పత్తి ఇక్కడి నుంచే మొదలుపెట్టారు. 1985లో లాంగ్ వాల్ యంత్రం ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రారంభించగా, 1990లో వెయ్యి టన్నుల బంకర్ ఏర్పాటుచేశారు. అలాగే, 1990లో మ్యాన్ రైడింగ్(కార్మికులను పనిస్థలానికి చేర్చే కుర్చీ) ఏర్పాటు చేయగా, 1998లో బీజీ ప్యానల్ ద్వారా బొగ్గు ఉత్పత్తి మొదలుకాగా, 2004లో రెండో సారి ఎస్‌డీఎల్ ఏర్పాటైంది. 2006లో సీఎమ్మార్ ద్వారా ఇక్కడే తొలిసారిగా బొగ్గు ఉత్పత్తి ప్రారంభించారు. ఆతర్వాత 2011లో గనిపై తొలిసారిగా మినరల్ ప్లాంట్, 2012లో గనిలో గ్యాస్ నివారణకు సీఓ 2 ప్లాంట్, 2012లో గనిలో వేడిని తగ్గించేందుకు రూ.6 కోట్లతో ఏసీ ఏర్పాటు ఏర్పాటుచేశారు. ఇక 2014లో చైనా నిపుణులు రూపొందించిన చైర్ కార్ ద్వారా బొగ్గు ఉత్పత్తి ఇక్కడే మొదలైంది.

ఇంకా నిక్షేపాలు

1954లో ఈ గని ప్రారంభంకాగా, తొలినాళ్లలో 447.99 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఆతర్వాత 71 సంవత్సరాలలో 127.05 మిలియన్ టన్నుల బొగ్గు వెలికి తీయగా, ఇంకా 320.94 మిలియన్ టన్ను బొగ్గు నిక్షేపాలు నిల్వలు ఉంటాయని అంచనా. మళ్లీ ఈ గనిని ప్రారంభిస్తే 2059-60 సంవత్సరాల వరకు వేలాది మందికి ఉపాధి లభించనుంది. ఈ విషయమై సింగరేణి ఉన్నతాధికారులను సంప్రదించగా... కేంద్రం ప్రభుత్వ పరిధిలోని పర్యావరణ శాఖ నుంచి వీకే-7 ఓసీకి సంబంధించిన అనుమతులు రావాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే ఉన్నతాధికారులతో మాట్లాడామని చెప్పారు.

హామీలన్నింటినీ అమలు చేస్తాం

డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని కాంగ్రెస్ ఖమ్మం జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ వెల్లడించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... అత్యధిక మెజార్టీతో సీపీఐతో సహా తొమ్మిది సీట్లలో తమ అభ్యర్థులను గెలిపించిన అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్ష హోదాలో గత పదేళ్ల కాలంలో జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడామని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు దొబ్బల సౌజన్య, కమర్తపు మురళి, బెల్లం శ్రీనివాస్, నల్లమల వెంకటేశ్వరరావు, కొప్పుల అశోక్, బొడ్డు బొందయ్య, మొక్కా శేఖర్‌గౌడ్, ముజాహిద్ హుస్సేన్, చోటేబాబా, పుష్ప, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్, పక్కన నాయకులు

ఇరువర్గాల నడుమ వాగ్వాదం

కాంగ్రెస్ కార్యాలయంలో కార్మిక కర్షక కాంగ్రెస్(కేకేసీ) కొత్త ఆటో యూనియన్ నాయకులు కేక్ కట్ చేసేందుకు వచ్చారు. వీరిని ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ నాయకులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. దీంతో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఇరువర్గాలను నచ్చజెప్పారు.

డీసీసీబీ సీఈఓగా రెహమాన్?

పాలకవర్గం తీర్మానం అనంతరం వెల్లడి

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నూతన సీఈఓ(ముఖ్య కార్యనిర్వహణాధికారి)గా అబీద్ ఉర్ రెహమాన్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఈమేరకు టస్కాబ్(తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు) సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఎస్‌బీఐలో డీజీఎంగా విధులు నిర్వర్తించి రిటైర్ అయిన ఆయన పేరును సీల్డ్ కవర్‌లో ఖమ్మం డీసీసీబీ కార్యాలయానికి పంపించినట్లు తెలిసింది. ఖమ్మం డీసీసీబీ సీఈఓ పదవి సెప్టెంబర్‌లో ఖాళీ కాగా, వివిధ బ్యాంకుల్లో ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులే కాక డీసీసీబీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. టస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు ఆధ్వర్యాన ఇంటర్వ్యూలు చేపట్టగా, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియామక ప్రక్రియ నిలిపేశారు. తాజాగా అబీద్ ఉర్ రహమాన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తుండగా, డీసీసీబీ పాలకవర్గం సమావేశమై తీర్మానం చేశాక నియామకాన్ని ధ్రువీకరించనున్నారు.



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం

ఆటల పోటీల్లో దివ్యాంగుల ఉత్సాహం



పోటీల్లో బాల్ విసురుతున్న దివ్యాంగులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జీఎం

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి ఆర్‌సీఓఏ క్లబ్‌లో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. శాంతి డెఫ్ అండ్ డంబ్, మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ స్కూల్‌కు చెందిన దివ్యాంగులు హాజరు కాగా, ఆటల పోటీలు నిర్వహించారు. పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సింగరేణి ఏరియా జీఎం శాలేంరాజు విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. దివ్యాంగులకు సేవ చేస్తే దేవుడికి సేవ చేసినట్లుగానే భావించాలని తెలిపారు. అధికారులు మజ్జి మురళి, సీనియర్ రమణారెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ క్రిసోలైట్, సాగర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్లు సిద్ధం



బాలుర ఖో-ఖో జట్టుతో నిర్వాహకులు



జిల్లా బాలికల ఖో-ఖో జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీలకు 85 మంది బాలురు, 45మంది బాలికలు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారితో ఎంపిక చేసిన జిలా జట్లు ఈ నెల 8నుంచి నిజామాబాద్ జిల్లా నందిపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పసుపులేటి వీరారాఘవయ్య తెలిపారు. కాగా, ఈ ఎంపిక పోటీలను అసోసియేషన్ ప్రతినిధులు, పీఈటీలు నర్సయ్య, చేపూరి శ్రీహరి, ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్.కే.రంజాన్, ఎస్.రామారావు, కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.